# అమృత హస్తం

కామాక్షమ్మగారి ఆనందానికి అవధుల్లేవు. ప్రకాశం దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. పోస్టుమేన్ చేతిలోని కవరు అందుకొని చింపుతూ వుంటే సంతోషంతో ఆమె చేతులు వణికేయి. ఉత్తరంలోని విషయం అర్థమయ్యేసరికి మనసు పురివిప్పిన నెమలికి మల్లే నాట్యం చేసింది. ఆలోచనలు అందాల హరివిల్లులయ్యేయి. ఉత్తరం మరొకసారి చదువుకుంది ఆవిడ.

'అమ్మకు -

నమస్కారములు!

నేను. మీ కోడలు, చిరంజీవి ఇందు కలిసి బెంగుళూరు వెళ్తున్నాం. దారిలో మనవూళ్ళో ఒకపూట ఆగుతాం. ఈ విధంగానయినా నిన్నూ, నాన్నగారినీ చూడటం అవుతుంది. ఇరవై అయిదోతారీఖు ఉదయం మెయిలులో దిగి అదేరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళిపోతాం. నాన్నగారు ఆరోగ్యంగా వున్నారని తలుస్తాను. ఆయనకి నామీద కోపం తగ్గిందనుకుంటాను - ప్రకాశం.

ఉత్తరం మడిచి గబగబా అడుగులేసుకుంటూ లోనికి వెళ్ళింది ఆవిడ.

వెనుక వరండాలో కవాచీ బల్లమీద తీరుబడిగా కూర్చుని పొగాకు కాడకు ఈనెతీస్తూ పొత్తి జాగ్రత్తగా తయారుచేసి దానిని ఆకుమధ్యలో ఉంచి, దివిటీలా పెద్దచుట్ట తయారుచేసే ప్రయత్నంలో వున్నారు విశ్వనాథంగారు.

రెండు మైళ్ళ దూరంలోని పట్నం హైస్కూలులో తెలుగు పండితుని హోదా వెలిగించి, పదేళ్ల క్రితం రిటైరయ్యేరాయన. ఆర్జనలో వున్నంతకాలం ఆయన సంపాదనలో నాలుగో వంతు లంక పుగాకు చుట్టలకు ఖర్చయ్యేది. రిటైరయిన తర్వాత ఫించను డబ్బులో సగంవీటికి ఖర్చవుతోంది.

అయితే స్వగ్రామంలో సొంత లోగిలివుండటం వల్ల ఇతర బాదరా బందీలు లేకపోవటం వల్ల సంసారం సుఖంగానే గడిచిపోతోంది.

విశ్వనాథంగారికీ, కామాక్షమ్మగారికీ ఏకైక సంతానం ప్రకాశం.

ప్రకాశం మెరికలాంటి కుర్రాడు

ప్రతి క్లాసులోనూ ఫస్టురేంకులో నిలబడి ఇంజనీరింగుసీటు సంపాదించేడు. కోర్సు పూర్తయిన వెంటనే బొంబాయిలో ఒక ప్రయివేటు కంపెనీలో చేరి మూడు వేల రూపాయల జీతగాడయ్యాడు.

అంతవరకూ విశ్వనాథంగారికి ఏ విషయంలోనూ పేచీ లేకపోయింది.

అయితే ప్రకాశం ఉద్యోగంలో చేరిన ఏడాదిలోనే అసలు గొడవ ఆరంభమయింది.

మంచి సంబంధం చూసి కొడుక్కి పెళ్లి చేయాలని తపన పడిపోయారు ఆయన.

తాను ఎన్నో ఉత్తరాలు రాస్తున్నా, పెళ్లి విషయం ప్రకాశం వాయిదా వేస్తూ వుండటంతో మనసులో కాస్త అనుమానం ఆరంభమయింది ఆయనకు.

తన అనుమానం నిజమే అని తెలిసిన రోజున విశ్వనాథంగారు ఆగ్రహోదగ్రులయ్యారు.

కొడుకు తన మాటను కాదని, అదెవతో బెంగాలీ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నందుకు అగ్నిహోత్రావధానుల్లా మండిపడ్డారు.

'ఈ వెధవ, నాకడుపున చెడబుట్టేడు' అంటూ ధుమధుమలాడేరు.

'వాడికీ నాకూ ఏ సంబంధమూలేదు.' అంటూ వీరావేశంతో ఊగిపోయారు.

'వాడికి తర్పణవిడిచి తద్దినాలు పెట్టేస్తాను' అంటూ విరుచుకుపడ్డారు.

భర్తకోపం చూసిన కామాక్షమ్మ గజగజ వణికిపోయింది.

ఆయన కోపం సంగతి ఆమెకు బాగా తెలుసు.

ఆ తర్వాత

కొత్త పెళ్ళాంతో వారంరోజులు గడుపుదామని ఇంటికొచ్చిన ప్రకాశం ఒక్కగంటలోనే తిరుగు ప్రయాణం కట్టవలసి వచ్చింది.

విశ్వనాథంగారు ప్రకాశంవైపు కన్నెత్తి చూడలేదు. పన్నెత్తి పలుకలేదు.

ప్రకాశం ఆ పరిస్థితిని భరించలేకపోయాడు.

"అమ్మా! నేనూ మా ఆవిడ ఇక్కడ ఒక వారంరోజులు గడుపుదామని వచ్చేం. కానీ నాన్న కోపం చూస్తే ఈ ఇంట్లో మాకు స్థానం లేనట్లే కనిపిస్తోంది. ఆయన కోపం తగ్గేక మళ్ళీ వస్తాం" అంటూ ఎంత బతిమిలాగినా వినకుండా భార్యను తీసుకొని వచ్చిన గంటలోనే తిరిగి బయలుదేరి బొంబాయి వెళ్ళిపోయాడు ప్రకాశం.

ఆరోజున కుమిలి కుమిలి ఏడ్చింది కామాక్షమ్మగారు.

ఆ తర్వాత

అయిదు సంవత్సరాలు కాలగమనంలో కలిసిపోయాయి. ఈ అయిదు సంవత్సరాల కాలంలోనూ భర్తకు ప్రకాశం మీద కోపం తగ్గించటంలో కృతకృత్యురాలయింది ఆవిడ. దాని పర్యవసానంగానే మూడు నెలలక్రితం నుండీ ప్రకాశాన్ని బయలుదేరి రమ్మనమని పదే పదే ఉత్తరాలు రాయసాగింది! అదీ, భర్త అనుమతితోటే!!

ఇన్నాళ్ళకు ప్రకాశం కుటుంబంతో సహా బయలుదేరి వస్తున్నాడు.

చుట్టిన పొగచుట్ట, పళ్ళమధ్య బిగిస్తూ విశ్వనాథంగారు తల ఎత్తి కామాక్షమ్మ

వంక చూసేరు.

అరక్షణంలో ఆమె చేతిలోని ఉత్తరాన్నీ, ఆమె ముఖంలోని ఆనందాతిశయాన్ని గ్రహించేరు.

"సుపుత్రుడు ఉత్తరం రాశాడా?"

యథాలాపంగా అడిగేరాయన

"అవునండీ ... అబ్బాయివాళ్ళూ రేపు మెయిల్లో బయలుదేరి వస్తున్నారట" అంటూ విషయం వివరించి చెప్పింది.

తరువాత మెల్లగా "... ఆఖరి రోజుల్లో వున్నాం... వాడిమీద కోపం చూపించకండి..." అంటూ ఏదో చెప్పబోయేలోగా "నీ ఒక్కదానికే వాడిమీద ప్రేమ ఒలికిపోతున్నట్లు మాట్లాడకు..." అంటూ మరి ఆ సంభాషణ పొడిగించటం ఇష్టం లేనట్లు కవాచీ బల్లమీద నుండిలేచి, కండువా భుజం మీద వేసుకుని వీధిలోనికి వెళ్ళిపోయారు. భర్త ఆమాత్రం మాట అన్నందుకే, ఆమె మనసు ఆనందంతో పొంగిపోయింది.

ప్రకాశం వాళ్ళూ రావటానికి ఇంక కేవలం పదహారు గంటలు మాత్రమే వ్యవధి వుంది.

మధ్యాహ్నం ఒక్కపూటా భోజనం చేసి వెళ్ళిపోతారువాళ్ళు. వాడికి ఇష్టమయినవి అన్నీ రెడీ చేసి పెట్టాలి. తనచేతులతో వండి, వాడికి తినిపించి ఎంత కాలమయిందో?

ప్రకాశానికి ఇష్టమయిన పదార్థాలన్నీ జ్ఞప్తికి తెచ్చుకుని, చకచకా కార్యరంగంలోకి దిగింది ఆవిడ.

పెరుగుగారెలు కోసం మినప్పప్పునాన బెట్టింది. బొబ్బట్లు చేయటానికి శెనగపప్పు నానబోసింది. పచ్చిమిర్చి, అల్లం తరిగేసి, కరివేపాకు తురిమి పులిహోర కలపటానికి రంగం సిద్ధం చేసింది.

కందిపప్పు వేయించి, కందిగుండ విసిరి ఉప్పూకారం సమతూకంలో కలిపింది. గోంగూర మిరపపళ్ళతో కలిపి పచ్చడి చేసింది. వెళ్ళేటప్పుడు సీసాల్లో సర్ది ఇవ్వటానికి వీలుగా మరింత తయారు చేసింది.

నెలరోజులకు పైగా నిలవ ఉండటానికి వీలుగా, ఇంగువ కాచిన నూనె ఓ అర్థపావు పోసి పచ్చడి సీసాల్లో సర్దింది.

రేపు కూర ఏం వండాలి?

కాకరకాయల్లో గింజలు తీసేసి ఉల్లికారం కూరి వండితే ఎంతో ఇష్టంగా తింటాడు ప్రకాశం. మెంతికారం పెట్టి, గుత్తివంకాయ వండితే, మరీ ఇష్టంవాడికి.

శెనగపప్పుకు కొబ్బరి కోరు చేర్చి పోపు తగిలిస్తే వదలకుండా తింటాడు.

బెండకాయ వేపుడంటే ప్రాణం వాడికి

ఆనపకాయ తెలకపిండి పెట్టి వండితే సరేసరి, వీటిలో ఏం వండటం?

అంతలోనే ఆమెకు చటుక్కున గుర్తుకు వచ్చింది అరటిదూట కూర, ఆవపెట్టి వండితే ప్రకాశానికి మహా ఇష్టమని!

ఇంటికి శెలవల్లో వచ్చినప్పుడల్లా అరటిదూట కూరవండమని వేధించుకు తినేవాడు ప్రకాశం.

బొంబాయిలాంటి మహానగరంలో అరటిదూట ఎక్కడ దొరుకుతుంది?

ఎన్నాళ్ళయిందో వాడు ఆ కూర తిని?

ఆ ఆలోచన రావటమే తరువాయి

పని మనిషిచేత పెరట్లో అరటిచెట్టు కొట్టించి బోదెలు వలిపించేసింది. నవనవలాడుతున్న దూటను బయటకు తీయించింది.

విశ్వనాధంగారు చీకటి పడ్డాక ఇంటికి వచ్చేరు. మండువాలో కామాక్షమ్మగారు పడుతున్న హైరానా చూసి విస్తుపోయారు.

ఒకవారగా తిరగలి చుట్టూ గోనెపట్టా మీద ఒలికిపోయిన కందిగుండ

మరోకమూల తుంపి పారేసిన గొంగూర కాడలు.

ఇంకోమూల అరటి దొప్పలు, గిన్నెల నిండా నానుతున్న రకరకాల పప్పులు. పళ్ళేలలో సిద్ధం చేసిన మిర్చి అల్లం ముక్కలు. ఇదంతా చూసి విశ్వనాధం గారికి మతిపోయినట్లయింది.

"ఏమిటీ హడావుడి?" అంటూ భార్యవంక చూసేరు. పనిలో నిమగ్నమయిన కామాక్షమ్మగారికి భర్తమాటలు విన్పించలేదు.

అరటిదూట గబగబా చక్రాల్లా తరుగుతూ, బయటకు వస్తున్న దారంలాంటి పీచును చూపుడువేలుకు చాకచక్యంగా చుట్టుకుంటూ, మోచేతితో నుదుట చెమటను ఒత్తుకుంటూ, ఒగరుస్తూ, కత్తిపీట ముందు కూర్చున్న కామాక్షమ్మని చూడగానే జాలికల్గింది విశ్వనాధం గారికి.

"కాముడూ! ఏమిటిదంతా?"

కామాక్షమ్మగారు మెల్లగా తల ఎత్తి చూసేరు. చెమటకు ముక్కుమీదుగా జారిపోతున్న కుంకుమను చిటికెన వేలికి చీరచెంగు తగిలించి సుతారంగా తుడుచుకుకున్నారు. తుడవగా మిగిలిన కొద్దిపాటి కుంకుమపొడి, చెమటతో కలిసి ముక్కుకు బిగించిన తెల్లని ఒంటిరాయి పొడి నత్తు మీద నిలబడి కెంపులా మెరుస్తోంది.

ఆవిడ కన్నులనిండా వెలుగు!

అంతవరకూ పనివలన కల్గిన అలసటను భర్త 'కాముడూ' అని పిలవటంతో మరిచిపోయింది. తనపై ఎంతో జాలికల్గిన సందర్భంలో తప్ప తనను అలా సంబోధించడని ఆవిడకు తెలుసు.

"కాముడూ నీకు మతిపోలేదుకదా. ఏమిటి హడావుడి అంతా?"

మళ్ళీ అడిగేరాయన

"రాకరాక అయిదేళ్ళ తర్వాత వస్తున్నాడు. వాడికి ఇష్టమయినవి నాలుగూ చేసి పెడదామని"

"బాగుంది నీ వరస! వాడు ఉండేది ఒక్కపూట! ఆ ఒక్కపూటలోనూ వాడిచేత అయిదు సంవత్సరాలు తిండీ తినిపించేద్దామని నీ ప్రయత్నంలా కన్పిస్తోంది" మాటలు ఆపి, చేతిలోని చుట్ట నుసి దులుపుతూ..." అయినా నీ వెర్రిగానీ, ఈ పల్లెటూరి తిళ్ళన్నీ వాడు తింటాడా? ఇవన్నీ ఏనాడో మరిచిపోయి వుంటాడు" అన్నారు.

ఈ మాటలతో కామాక్షమ్మగారు డీలాపడిపోయింది. అంతలోనే మళ్ళీ ధైర్యం పుంజుకుని "పట్నవాసంలో వున్నంత మాత్రాన వాడికి ఇష్టమయిన రుచులు మారిపోతాయా, మీరు మరీ చెబుతారు" అంది నిరసనగా.

విశ్వనాథంగారు చిన్నగా నవ్వేరు.

తర్వాత అన్నారు "మన ప్రాణాలన్నీ వాడిమీదే పెట్టుకుని పెంచి పెద్దచేశామా? చివరకు ఏం చేశాడు? బెల్లం ముక్కలాంటి బెంగాలీ అమ్మాయి కన్పించగానే మనల్ని మరిచిపోయేడు. హా ఈ పాటికి వాడు ఏ ఎండు చేపలో తిని అఘోరిస్తూ వుంటాడు. నీ అరటిదూట కూర ఎవడికి కావాలి?"

తరవాత పెరట్లోకి వెళ్ళిపోయేరు.

కామాక్షమ్మగారి మనసు కొంతసేపు విలవిల్లాడింది.

'ప్రకాశం మారిపోయే మనిషికాదు' అని అంతలోనే సర్దిపెట్టుకుంది.

ఇల్లాంతా ఊడ్చి ముగ్గులు పెట్టి నడుం వాల్చేసరికి రాత్రి పన్నెండు దాటిపోయింది.

ఉదయం నాలుగు గంటలకు పక్కమీద నుండి లేచిందే తడవుగా వంటింట్లో కర్రలపొయ్యిరాజేసింది కామాక్షమ్మ. పట్నానికి రైలు ఎనిమిదిన్నరకు వస్తుంది.

అంటే తొమ్మిదో గంటకల్లా వాళ్ళు ఇంటికి చేరుకుంటారు. అప్పటికి వంట తెముల్తుందో, తెమలదో అని ఆవిడ భయం.

వంట పూర్తయిపోతే, ఆనాలుగు గంటలసేపు వాడితో కబుర్లు చెప్పొచ్చు.

కోడలు మనభాష నేర్చుకుందో లేదో?

ఇందూకి తెలుగువచ్చునో, రాదో?

అయిదు గంటల సమయంలో కంచు గ్లాసుడు కాఫీ గటగటా తాగేసి పై మీది ఉత్తరీయం సవరించుకుని చుట్ట ముట్టించి బయటకు వెళ్తున్న భర్తవంక చూస్తూ

"తొందరగా వచ్చెయ్యండి అబ్బాయివాళ్ళు తొమ్మిది గంటలకు వచ్చేస్తారు కదా" అంది ఆవిద.

"ఓసినీ ఇల్లు బంగారంకానూ! నేను వెళ్ళేది బహిర్దేశానికి! బెంగుళూరుకాదు". అన్నారు నవ్వుతూ.

"వచ్చేటపుడు ఎవరితోనో మాటల్లోపడి ఇల్లుమరిచిపోతారు, అందుకని చెప్తున్నాను. అయ్యో... నా మతి మండా మరిచేపోయాను చూశారా? ... ఎనిమిది గంటలకు బట్టలకొట్టు తెరుస్తారు... కోడలకి మంచి చీర, రవికెలగుడ్డ తీసుకురావాలి... ఆ చేత్తోనే మనవరాలికి గౌనుగుడ్డ తేవటం మరిచిపోకండి" అంటూ. పొగనిండిపోతున్న పొయ్యి ఊదటానికి వంటింట్లోకి పరుగుపెడుతున్నట్లే వెళ్ళిందామె.

భార్యవంక వింతగా చూస్తూ వీధిలోకి కదిలివెళ్ళిపోయారు.

రావాల్సిన సమయం రానే వచ్చింది.

టాక్సీలో ప్రకాశం, కోడలు, మనుమరాలు ఇందూ దిగేరు. గుమ్మందగ్గర వాళ్ళను ఆపి, దిష్టితీసి, లోనికి తీసుకువచ్చింది కామాక్షమ్మగారు.

ప్రకాశం బాగా చిక్కిపోయినట్లు కన్పించేడు ఆమె కంటికి.

కోడలు "నమస్తే కామాక్షి అత్తయ్యగారు..." అంటూ ఆరంభించి మాటలు తడుముకుంటూ తెలుగు మాట్లాడింది.

బుట్టబొమ్మలా వున్నా ఇందూని చూస్తూ, వెర్రిదానిలా వుండిపోయింది కామాక్షమ్మ కొంతసేపు.

"నాన్నా మీ ఆరోగ్యం బాగుందా?" అంటూ పలకరించేడు ప్రకాశం.

"ఆ ఏదో బాగానే ఉంది."

పొడిగా అన్నాడు విశ్వనాథం గారు.

మనసురాజీపడినా, మాటలు బయటకురావటానికి కొన్ని నిమిషాలు అవసరమయ్యేయి.

"ఆ టాక్సీ ఎందుకు? పంపించెయ్" అన్నారు కొంతసేపు ఆగి.

"ఉండేది నాలుగ్గంటలే కదా, 'వెయిటింగ్ ఛార్జెస్' ఇచ్చేస్తాను ఫర్వాలేదు" అన్నాడు ప్రకాశం. కామాక్షమ్మగారు మూడు గ్లాసులతో కాఫీ తెచ్చేరు.

"కాఫీ ఆయన వంటికి పడదు... నేనూ ఇందూ అసలు తీసుకోం" అందికోడలు.

కామాక్షమ్మగారు విస్తుపోయారు.

'అరగంటకోసారి కాఫీతాగే ప్రకాశానికి కాఫీ పడకపోవటమేమిటి'? అనుకున్నారు.

"ఆయన 'కాంప్లాన్' తాగుతారు. నేనూ ఇందూ 'బోర్నవిటా' తాగుతాం. పాలువుంటే పంచదార కలిపి ఇవ్వండి చాలు" అంటూ బేగులోనుండి కాంప్లాన్, బోర్నవిటా డబ్బాలు తీసిపైన పెట్టింది. కామాక్షమ్మగారు తెచ్చిన పాలతో కాంప్లాన్ కలిపి భర్తకు ఇచ్చింది.

తర్వాత తనూ, ఇందూ బోర్నవిటా కలుపుకు త్రాగారు. ఆ దృశ్యం చూసి కామాక్షమ్మగారి మనసు కొంతసేపు బాధతో మూల్గింది.

అయితే స్నానాలు పూర్తయ్యేక, వంటింట్లో భోజనాల ముందు కూర్చున్నాక కోడలుపిల్ల చేసిన హడావిడి మాత్రం కామాక్షమ్మగారి మతిని పోగొట్టింది.

కంచాల్లోనూ, ప్లేట్లలోనూ సర్దిపెట్టిన వంటకాలన్నీ చూసి "కామాక్షి అత్తయ్యగారూ... ఇవన్నీ ఆయన వంటికి పడవు" అంటూ అదోలా ముఖం చిట్లించింది.

ప్రకాశం ఆమెకు పేరుపేరునా వంటకాల వివరాలు విడమరిచి చెప్పేడు.

"మైగాడ్! ఇవన్నీ మీరు తింటారా? నో... నో... అత్తయ్యగారూ ఇవి ఆయన వంటికి పడవు" అంటూ బాంబుపేల్చింది కోడలు కొంతసేపు ఆగి

"బ్రింజాయిల్ ఆయనకి ఎలర్జీ... టేమరిన్‌రైస్ అసలే పడదు... బొబ్బట్లు ... టెరిఫిక్ స్వీట్... అసలే షుగర్ కంప్లయింట్ వస్తుందని భయం.

ఓహ్... 'రెడ్ ఛిల్లీస్' ఇన్ చట్నీ... డైరెక్ట్‌గా చిల్లీస్ ఎలా తింటారు? 'అల్సర్' వస్తుంది. వడై మీన్స్ వెరీ అన్ డైజెస్టబుల్..." అంటూ పేరుపేరునా ప్లేట్లలోని వస్తువుల వంక చూపుడు వేలుతో చూపుతూ వాటిని దూరంగా తోసేసింది. ఆఖరున అరటిదూట కూరవంక చూపిస్తూ "ఇది ఏమిటి?" అంటూ అడిగింది.

"అది అరటిదూట... ఆయ్‌మీన్..." అంటూ దానికి సరియైన ఇంగ్లీషుపదం, బెంగాలీపదం తెలియక కొంతసేపు బుర్రగోక్కుని తర్వాత అరటి చెట్టును చేత్తోనే వలిచినట్లు నటించి, దూట ఎలా తీస్తారో, దూట అంటే ఏమిటో, ఆమెకు అర్థమయ్యేలా చెప్పేడు ప్రకాశం.

ఆ వివరాలు వినగానే అతి అసహ్యంగా ముఖంపెట్టి దాదాపు కెవ్వున కేకవేసినంత పనిచేసింది కోడలుపిల్ల!

"బఫెల్లో ఫీడ్ అది.... మీరు తింటారా?" అంటూ భర్తవంక నిరసనగా చూసి ఆ ప్లేటును దూరంగా జరిపేసింది ఆమె.

ప్రకాశం ఒక్క నిమిషం దెబ్బతిన్నట్లు ఆమె వంక చూసి మౌనంగా వుండిపోయాడు.

జరిగే తతంగమంతా తనకేమీ పట్టనట్లు, పుగాకు కాడ ఈనెతీస్తూ, కవాచీ బల్లమీద కూర్చుని చూస్తున్నారు విశ్వనాథంగారు.

కోడలుపిల్ల కంచం దగ్గరనుండి లేచింది.

చకచకా వెళ్ళి తన బేగు తెరిచి నాలుగు ఏపిల్సు ఒక పొడవాటి బ్రెడ్డు, జామ్‌సీసా బయటకు తీసింది.

"బొత్తిగా కేలరీస్ లేని తిండి తింటే ఎలాగ? అసలే మీ ఆరోగ్యం అంతంత మాత్రం డాక్టర్ సతీష్ బెనర్జీ ఏం చెప్పారో గుర్తులేదా మీకు" అంటూ గబగబా ఏపిల్సు తరిగి పళ్లెంలో సర్దింది. తర్వాత బ్రెడ్‌కోసి, ముక్కలకు జామ్ అతి తక్కువగా రాసి రెండేసి కలిపి కంచాల్లో పేర్చి పెట్టింది.

"ఆ ముక్కలు తినేసి తర్వాత కొంచెం 'కర్డ్ రైస్' తినండి" అంది భర్తతో. తర్వాత అత్తగారి వంక తిరిగి "కామాక్షి అత్తయ్యగారూ ఇవన్నీ వండినందులకు థేంక్స్, ఇవేవీ ఆయనకుసరిపడవు... కాస్త 'కర్డ్' ఇవ్వండి" అని మాట్లాడటం ముగించి ఇందూకి ఆపిల్ ముక్కలు అందించింది.

కామాక్షమ్మగారికి కాళ్ళకింద భూమి చీలిపోతున్నట్లు అనిపించింది.

'నిన్న సాయంకాలం నుండీ తాను పడిన కష్టమంతా వృధాయేనా?' అనుకుంటూ కొంతసేపు కొర్రులా నిలబడిపోయింది.

"పెరుగు తెచ్చివడ్డించు" విశ్వనాథంగారి మాటలతో ఈలోకంలోకి వచ్చి వంటింట్లోకి కదిలింది.

పెరుగుగిన్నె వాళ్ళదగ్గర పెట్టింది. కోడలుపిల్ల ఆ గిన్నెను దగ్గరగా తీసుకుంది. ముట్టుకుంటే కందిపోతుందన్నట్లు చెంచాతో పై మీగడకు జాగ్రత్తగా తొలగించి, లోపలి పెరుగు రెండే రెండు చెమ్చాలు కంచంలోనూ, మరొక చెంచా ఇందూ కంచంలోనూ విదిల్చింది.

మూలుగుతున్న మనసును మరి సంబాళించుకోలేకపోయింది కామాక్షమ్మగారు.

"ఆపై మీగడతీసి ప్రకాశానికి వడ్డించమ్మా. వాడికి మీగడ ఎంతో ఇష్టం. నువ్వు కూడా తిను. ఎంతో రుచిగా వుంటుంది. ఎదిగే పిల్లలకి మరీ మంచిది ఇందూకి కాస్తపెట్టు..." కాస్త కటువుగానే అంది. కోడలు పిల్ల చిరునవ్వు నవ్వేసింది.

"కామాక్షి అత్తయ్యగారూ, థేంక్యూ! మీగడనిండా 'ఫేట్' వుంది. అది తింటే 'కెలోస్ట్రల్' పెరిగిపోతుంది" అంది మెల్లగా.

చిక్కని గేదెపాలు, పిడకలతో దాలిపెట్టి అందులో మరగబెట్టి తోడుపెడితే దానిమీద ఎర్రగా ఇంత మందాన గూడు కట్టే మీగడలో అద్భుతమైన రుచీ ఆరోగ్యం వుందని మాత్రమే కామాక్షమ్మగారికి తెలుసుగానీ 'ఫేట్' వుందని తెలీదు!

కమ్మని పెరుగూ అన్నం తృప్తిగా తింటే పెరిగేది ఆరోగ్యమే కానీ మరేదో పెరిగిపోతుందంటోంది కోడలు. అదేమిటో అసలు అంతుచిక్కలేదు కామాక్షమ్మగారికి. భోజనాలు పూర్తి అయిపోయాక

"అమ్మా నువ్వూ నాన్నా బొంబాయి వచ్చేయ్యండి" అన్నాడు ప్రకాశం.

"యు ఆర్ వెల్‌కమ్ అత్తయ్యగారూ" అందికోడలు.

"ప్లీజ్, డూ కమ్ గ్రాండ్ మా" అంది ఇందూ.

"ఈ వూరికీ, గాలికీ అలవాటు పడినవాళ్ళం వదిలేసి రావటం అంతసులువా?" అన్నారు విశ్వనాథంగారు. సామాన్లు సర్ది టాక్సీలో చేర్చేడు ప్రకాశం. బయలుదేరబోయే ముందు విశ్వనాథంగారికి, కామాక్షమ్మ పాదాలకు ఇద్దరూ వంగి నమస్కరించేరు. కొత్త బట్టలు పెట్టి కన్నీళ్ళతో సాగనంపింది కామాక్షమ్మ. టాక్సీ కదిలిపోయింది.

"కావుడూ"

భర్త పిలుపువిని చీరచెంగుతో కళ్ళు ఒత్తుకుంది.

" వయసొచ్చేవరకూ వాడి అవరసరాలు, రుచులు నువ్వు చూసుకున్నావ్ ఇపుడు వాడి పెళ్ళాం చూసుకుంటోంది ఇందులో దిగులు చెందటానికి ఏమీ లేదు" అన్నారు విశ్వనాథంగారు భార్యను సముదాయించే ధోరణిలో.

"లేదండీ... వాడు నాకెప్పుడూ అద్దాల్లో బిడ్డడే. తిండి సరిగ్గా కుదరక చిక్కి సగమయ్యేడు చూడండి." అంది గొణుగుతున్నట్లు.

"సర్లే... అనవసరంగా దిగులుపడకు నేను పెద్దిరాజుగారింటికి వెళ్ళొస్తాను. నువ్వు భోజనం కానీయ్" అంటూ కండువా పైమీద పడేసుకుని బయటకు నడిచేరు విశ్వనాథంగారు. వంటింటి గుమ్మం గడపదగ్గర అలాగే కూలబడిపోయారు కామాక్షమ్మగారు, వండిన వంటకాల వంక చూస్తూ.

అలా ఎంత సమయం గడిచిందో ఆవిడకే తెలీదు.

వీధిలో కారు హారను ఖయ్యిమని మ్రోగటంతో తెప్పరిల్లి అటువైపుకు చూసేరు.

హడావుడిగా లోనికివచ్చేడు ప్రకాశం.

కాలిబూట్లు విప్పి ఒకవారగా పడేస్తూ" అమ్మా తొందరగా అన్నం వడ్డించునాకు. నా అదృష్టం కొద్దీ రైలుమూడుగంటలు లేటు. పర్సు మరిచిపోయానని చెప్పి వెనక్కి చక్కా వచ్చేను. అరటిదూట కూరా అన్నం నువ్వే కలుపు. ఎన్నాళ్ళయిందో నీ వంట తిని.

బొంబాయిలో చప్పిడి తిండితో జిహ్వచచ్చిపోయింది. బొబ్బట్లలో నెయ్యి వేయటం మరిచిపోకు. ఇందాకటి మీగడ పెరుగు కూడా కంచందగ్గర పెట్టు కాళ్లు చేతులు కడుక్కుని వచ్చేస్తాను....” అంటూ హడావిడిగా తువ్వాలు తీసుకుని పెరట్లోకి పరుగెత్తిన ప్రకాశం వంక మతి పోయినట్లు చూస్తూ వుండిపోయారు కామాక్షమ్మగారు. అది కలయో, వైష్ణవమాయో అనిపించింది కొంతసేపు. తర్వాత కామాక్షమ్మగారి మదిలో ఆనందతరంగాలు ఉవ్వెత్తున లేచిపడ్డాయి!

సంభ్రమంతో ఆమె కన్నుల్లో నీళ్ళు తిరిగేయి!

గబగబా లేచి, పీటవాల్చి, కంచంపెట్టి, వడ్డించేరు. మూడునిమిషాల తర్వాత వీధిలో ఆగివున్న కారువంక సంభ్రమంగా చూస్తూ ఇంట్లో అడుగుపెట్టిన విశ్వనాథంగారు, వంటింట్లోని దృశ్యంచూసి కొంతసేపు అలాగే నిలబడిపోయారు.

కూర అన్నం కలిపి ముద్దలుచేసి ప్రకాశం నోటికి అందిస్తోంది కామాక్షమ్మ!

ఊహ తెలిసేక సుమారు అరవైయ్యేళ్ళ జీవితంలోనూ ఆయన కంటనీరు తిరిగిన గుర్తు లేదాయనకు!

కానీ ఆ క్షణంలో ఇందుపగింజలంత కన్నీటి బొట్లు కనుకొలనుల్లో నిలిచి, ఆయన కనులు మసకబారేయి!! ★

(ఆంధ్రపత్రిక వీక్లీ, నవంబరు 1985)